

'మీరు రామారావుగారు కదూ ?'

వాష్ బేసిన్‌వద్ద చేతులు కడుక్కుంటున్న రామారావు ఉలిక్కిపడ్డట్టు తలెత్తి చూశాడు. సన్నగా, పొడుగ్గా, నవ్వుతూ నిలబడి వున్నాడు ఆ అడిగిన వ్యక్తి. బాగా చలాకీ అయిన మనిషి అని మొహం చూడగానే చెప్పేయవచ్చు. నల్లని పాంటులో గీతల చొక్కా టక్ చేసి నిటారుగా నిలబడి వున్నాడు. అతన్ని ఎప్పుడూ చూసినట్టు జ్ఞాపకం రాలేదు రామారావుకు. అతని చొరవకంటే ఎక్కువ రామారావును ఆశ్చర్యపరిచింది అతని భాషా, ధైర్యమూ.

'మీరు......మీరు...... అవును నేనే...' అన్నాడు తడబడుతూ ఆలోచనల్లోంచి తేరుకుని.

రామారావు ఆ కాలేజీలో అసిస్టెంటు ప్రొఫెసర్‌గా చేరి అది రెండో రోజు. ఒంటరిగా వచ్చిన కారణాన్న హాస్టల్లోనే తింటున్నాడు. ఈ రాష్ట్రంలో తనొక్కడే తెలుగువాడైపోయాడే అని ఒక రకమైన దిగులుతో వున్నాడు, వచ్చిన మొదటి రోజు నుండీ. ఇలా ఒక అపరిచితుడు హఠాత్తుగా వూడిపడి సూటిగా పలకరించడంతో ఎక్కడలేని ఆనందం పొందాడు ఆశ్చర్యంతో బాటు.

'నన్ను రవి అంటారండి; మీరు మాథమాటిక్స్ డిపార్ట్‌మెంటులో జాయిన్ అయ్యారనుకుంటా.'

చేతులు తుడుచుకుంటూ బయటకు వచ్చారిద్దరూ. ఎవరెవరో రవిని చూసి చిరునవ్వు నవ్వుతున్నారు పలకరింపుగా; రవి కూడా అందరితోనూ పరిచయం వున్నట్టు తలూపుతున్నాడు. 'ఎంత బాగా నవ్వుతాడో ఇతను' అనుకున్నాడు రామారావు రవిని చూస్తూ. ఠీవిగా నడుస్తున్న రవి అంటే ఎక్కడలేని స్నేహభావం కలిగింది రామారావుకు. ఇంతవరకు ఇద్దరికీ ఎక్కువ మాటలు లేవు; అయినా ఏదో చిరకాల పరిచితుడుగా, ఎంతో పాత స్నేహితుడుగా భావన కలిగింది రామారావుకు. హడావుడిగా మెస్సులోకి, బయటకు నడుస్తున్నారు విద్యార్థులంతా.

'మీరు నన్నెలా గుర్తుపట్టారూ ?' ఉండబట్టలేక అడిగాడు రామారావు.

అతని భావాలు చదివినట్టుగా జవాబిచ్చాడు రవి.

'క్షమించాలి. మీతో నాకు పరిచయం లేదు. కాని మీరు ఇక్కడికి వస్తున్నట్టు ముందుగానే తెలిసింది; మీ విద్యార్థి రంగరాజు చెప్పాడు. అతను ఎమ్. ఈ. ఇంటర్వ్యూకు వచ్చాడిక్కడికి. ఇక్కడ సెలక్టు కాలేదు లెండి; అతను ప్రస్తుతం ఢిల్లీలో వున్నాడు. మీ విషయం అతనే చెప్పాడు. మిమ్ములను చూడగానే పోల్చుకున్నాను, తెలుగువారని. రంగరాజు చెప్పింది ఒక్కసారిగా జ్ఞాపకం వచ్చి ధైర్యంగా తెలుగులోనే అడిగాను ... నేను సివిల్ ఇంజనీరింగు డిపార్ట్‌మెంటులో లెక్చరరుగా పని చేస్తున్నాను' చిన్నగా నవ్వాడు రవి తలతిప్పి రామారావు క్షిప

'ఇతని అసాధ్యం కూలా!' విస్తుపోయాడు. 'పాతికేళ్ళకూడా నిండినట్టు లేదే ఇతనికి' అనుకున్నాడు, ముఫ్ఫైల్లో అడుగుపెట్టిన రామారావు. ఎంత ధీమా ఇతనికి, ఎంత చొరవ! బాగా కలుపుగోరు మనిషని అతని ప్రవర్తనా, ఆతన్ని అందరూ పలకరించే తీరూ చెప్తున్నాయి. అతని నడకలో ఆత్మ విశ్వాసం, హుందాతనం వుట్టిపడుతున్నాయి.

రామారావు బిక్కుబిక్కుమంటూ తిరిగాడు మొదటి రెండురోజులూ. ఇక్కడికి రావడం తన తెలివి తక్కువతనం, కక్కుర్తి అనుకున్నాడు. ఛ! ఛ! ఇలా పొట్టచేత్తో పట్టుకుని దేశం పైనబడటమేమిటీ, శుభంగా ఉన్నవూళ్ళో వుద్యోగం వదులుకుని అని బాధపడ్డాడు. భాషకూడా తెలియని వూళ్ళో దేవిరించడ మేమిటి అని కించపడ్డాడు. ఇంతదూరం వచ్చి మళ్ళీ వెనక్కి వెళ్ళిపోతే ఎంత చిన్నతనం, తనను తాను అసహ్యించుకున్నాడు. అక్కడే హాయిగా ఉన్న వూళ్ళో ఉండక ఇక్కడేదో మూలుగుతుందని రావడం ఎందుకూ అని తిట్టుకున్నాడు

రామారావు ఆంధ్రదేశంలో ఒకానొక కాలేజీలో మాథమాటిక్స్ లెక్చరరుగా ఎనిమిదేళ్ళ నుండీ పనిచేస్తున్నాడు. ఎదుగూ, బొదుగూ లేని జీవితం. అసిస్టెంటు ప్రొఫెసరు ఆ కాలేజీలో కావడం అసంభవం అని రూఢిగా తెలిసిన మరుక్షణం నుంచీ బయటేనా ఆ వుద్యోగం దొరుకుతుందేమోనని గట్టి ప్రయత్నాలు మొదలు పెట్టాడు. అదృష్టం బావుండి అనుకోకుండా జయపూరు ఇంజనీరింగు కాలేజీలో దొరికింది.

'ఏదోలే దొరికినప్పుడు చూద్దాం' అని అనుకున్న రామారావు, అసిస్టెంటు ప్రొఫెసరు వుద్యోగం రాజస్థాన్‌లో రావడంతో సందిగ్ధావస్థలో పడ్డాడు. తన బి ఏ. లోని యూనివర్శిటీ రాంకూ, పి.హెచ్.డి., పబ్లిష్‌చేసిన పేపర్లూ తనకా వుద్యోగం సంపాదించి పెట్టాయి—ఇంటినుండి వేయి మైళ్ళ దూరంలో. కాని ఈ అర్హతలు తన కాలేజీలో గుడ్డి గవ్వకు చెల్లలేదు. అదే వుద్యోగానికి. అసలు ఆంధ్రలో వున్నన్ని రాజకీయాలు = మరెక్కడేనా వున్నాయా అనిపిస్తూంది. కులతత్వాలూ, బంధుత్వాలూ, పలుకుబడీ పని చేసేంత గట్టిగా ఇంకేవీ పనిచేయవు, మనరాష్ట్రంలో. ఉన్నత పదవిలో బ్రాహ్మణుడున్నప్పుడు బ్రాహ్మణులను నింపేస్తే, రెడ్డిగారు పదవీ స్వీకారం చేసిన మరుక్షణంనుండీ రెడ్లతో కళ కళలాడిపోతూంది. శాస్త్రిగారికీ రెడ్డిగారికీ మధ్య అర్హతలున్న వ్యక్తులు నలిగిపోతారు. ఈ పరిస్థితుల్లో పని చేయడం ఎవరికీ శక్యం కాదు కాని మనవాళ్ళకు పనితో పనిలేదే! ఫలానా శర్మగారు చేయగలిగే పని ఫలానా రావుగారు కూడా చేయగలరు—వీరి ఉద్దేశ్యంలో! ఏం, ఎందుకు చేయలేడూ? చేయకపోయినా ఏం ఒరిగిపోతూంది? ఈ ఒక్కడూ సరిగ్గా పనిచేస్తే ఈ దేశం ఏమైనా బాగుపడుతుందా? — ఎప్పటికీ దీని గతి ఇంతే ఎలాగూ బాగుపడదు కనక మనమూ, మనవాళ్ళేనా బాగుపడేలా చూడడం మన పవిత్ర కర్తవ్యం. దీనికోసం మనమంతా కంకణాలు కట్టుకుని కృషి చేస్తున్నాం. ఈ మనస్తత్వం భారతీయుల రక్తంలో జీర్ణించుకుపోయింది. దేశంకోసం పని చేయాలని కాదె, మనం పని చేయకుండా నెల నెలా జీతం డబ్బులు తినేస్తే దేశానికీ, దేశ ప్రగతికి వాటిల్లే నష్టం గురించి కానీ, సరైన వ్యక్తి సరైన స్థానంలో లేకుంటే మిగతావారిపైన దాని ప్రభావం గురించి కానీ, మన ప్రస్తుత నడవడీ, ప్రవర్తనా మన తరవాత తరం పైన దెబ్బతీస్తుందని కానీ మనం ఆలోచించం. ఎప్పుడూ మనకు కావలిసింది మన దగ్గరి బంధువు ఉన్నత స్థానంలో దూరి మన పనులు చేసిపెట్టడం, లేదా అడ్డ గాడిద అయిన సుపుత్రుడు రాకెట్‌లా పైపైకి ఎక్కిపోవడం. అంతా అర్హతలుండే పైకి వస్తున్నారా — ఛస్తున్నారా! ఏదో బండి నడుస్తూంది, మనం కూడా దాంతోబాటు పోతున్నాం; అంతే కాని దాన్ని నిరోధించడానికి మనం చేసే ప్రయత్నం శూన్యం. పైగా ప్రత్యక్షంగా దానికి దోహదం చేస్తున్నాం ఎవరైనా కష్టపడి, నిజాయితీగా పని చేసేవాడుంటే అందరికీ అడ్డంకులే అతన్ని మరోచోటికి మార్చడమో, లేక స్వస్తి చెప్పడమో, కనీసం అతడు పై స్థానంలోకిపోయి ఏకు మేకై కూర్చోకుండా వుండడానికి మిగతావాళ్ళంతా శాయశక్తులా కృషి చేస్తారు. ఈ రాజకీయాలూ, ఎత్తులూ కలుషిత వాతావరణం ఎవ్వరికీ మనశ్శాంతీ, ఏకాగ్రతా లేకుండా చేస్తాయి. దీంతో విధి నిర్వహణలో ఉత్సాహం తగ్గిపోతూంది. మొత్తానికి దెబ్బ తినేది దేశమూ, దేశ పురోభివృద్ధి.

ఇదంతా విని మామూలు విషయమైనట్టుగా నవ్వాడు రవి.

'చూడండి రామారావుగారూ, మన బలహీనతంతా ఇంటికి దగ్గర్లోనే వుద్యోగం చేయాలను కోవడమే. భారత దేశమంతా మనదే అయినప్పుడు, ఒకచోట మనం సరిగ్గా పనిచేయలేమనీ, అర్హతలు లేని వ్యక్తులు బంధుత్వాల మూలంగా పైకి పోతున్నారని తోచినప్పుడు మనం పనిచేయడానికి బోలెడన్ని అవకాశాలున్నాయి. మన దేశంనిండా, మనం ఇంటి దగ్గరే కూర్చోవాలి పట్టుబట్టకపోతే. అయినా ఎక్కడయితేనేం—పని చేయడానికి?'

మాట మార్చాడు రామారావు.

'ఇక్కడ తెలుగువాళ్ళెవరూ లేరా — ఇంకా?'

'ఇక్కడ ఇద్దరున్నారు—పి. వి. రావుగారని మెకానికల్ ఇంజనీరింగులో అసిస్టెంటు ప్రొఫెసరూ, నారాయణగారని లెక్చరరూ — రేపు మీకు వీలుంటే రండి పరిచయం చేస్తాను.'

'మరే, వచ్చేవారం మా ఆవిడ వస్తుంది. ఎవరేనా గృహస్థులతో పరిచయం లేకపోతే పరిగెత్తుకు పోతుందేమో ఇంటికి అని భయం. నాలాగే ఆమెకూ హిందీరాదు.'

అర్థమైనట్టుగా నవ్వాడు బ్రహ్మచారి రవి.

* * *

'మా ఆవిడ — పార్వతి! అని పరిచయం చేశాడు రామారావు.

మర్యాద సూచకంగా నమస్కరించాడు రవి. ఢిల్లీ వెళ్ళడం మూలాన వారం రోజులుగా జయపూరులో లేడు రవి మూడు రోజులకిందే రామారావు తమ్ముడు ఆవిడను దిగబెట్టి ఆ రోజే తిరిగి వెళ్ళిపోయాడు, తీరిక లేదంటూ.

మామూలు ఎత్తు, పొడుగాటి జడ, నుదుట ఎర్రటి కుంకుమబొట్టు, గుండ్రటి మొహం, ఆకర్షణీయమైన కళ్ళు, ఉట్టి

వడే అమాయకతా—పార్వతిని చూడగానే ఆంధ్రుల ఆడపడుచని చెప్పేయవచ్చు. ఆంధ్రుల్లో కనిపించే స్నేహభావమూ, కొత్తవాళ్లంటే కొద్దిగా బెంకూ ఆమెలో ప్రతిబింబిస్తాయి. మొదట్లో కొద్దిగా ముభావంగా వున్నా కొద్ది రోజుల్లోనే రవి ఆమెకు ఆత్మీయుడైపోయాడు. రవిలో ఆమెకు తనకు లేని అన్నయ్య కనిపించేవాడు. దాదాపు ప్రతి మరో రోజూ రవి వాళ్ళింటికి వెళ్తుండేవాడు.

ఒకరోజు రవితో అన్నాడు రామారావు. 'మా ఆవిడ వెళ్ళిపోదామంటుందోయ్ మా వూరికి—ఇక్కడ ఏం బాగోలేదనీ, బోరు కొడుతూందనీ అంటూంది.'

అదేమంత ఆశ్చర్యకరమైన విషయం కానట్టుగా నవ్వాడు రవి.

'నిజం! వూరికే దిగులుగా కూర్చుంటుందీ మధ్య. ఇంటినుండి ఉత్తరం వచ్చిన రోజు మరీ ఇదిగా వుంటుంది, రాకపోతే మళ్ళీ బెంగ. ఏం తోచడంలేదు—ఈవూళ్లో భాష తెలీదు, స్నేహితుల్లేరు మాట్లాడు దామన్నా అంటూ ప్రాణం తీస్తుంది. 'ఉన్న వూరికి దూరంగా కక్కుర్తికి రావడం ఎందుకూ, వెళ్ళిపోదాం అని ఒకటే గోల.'

మామూలుగానే నవ్వాడు రవి, 'నా ఉద్దేశ్యంలో మీరూ అదే అనుకున్నట్టున్నారు.'

రామారావు ఏం మాట్లాడలేదు

'స్నేహితులు కావాలంటే బోలెడుమంది ఇక్కడేనా, మనం స్నేహంగా వుంటే. ఒకే చోట వుంటే ఎవరికేనా బోరు కొడుతూంది. ఉదయపూరు, ఆగ్రా, ఢిల్లీ, చండీఘర్, సిమ్లా, మసూరీ...చాలా ప్రదేశాలున్నాయే ఈ దగ్గరిలోనే ? మీకు భాష సమస్య గనక ఇక్కడి తెలుగువాళ్ళతో పరిచయం పెంచుకోండి—వాళ్ళు కూడా ఇలాగే బోరు ఫీలవుతూంటారు. పి. వి. రావుగారినీ, నారాయణగారినీ పరిచయం చేశాను గదా మీకు ?'

'అవునోయ్ పి. వి. గారింటికి రెండు మూడుసార్లు వెళ్ళాం. ఆయనా, ఆవిడా బాగా మాట్లాడుతారు కాని నారాయణగారిల్లు వీళ్లింటినుండి కొద్ది దూరంలోనే వుందన్నారు. నాకు తెలీదు గనక పి. వి. రావుగారినే అడిగాను. అడిగినప్పుడెల్లా మొహం మాడ్చుకుని మాట మారుస్తారేం?' అనుమానం ధ్వనింపచేసి రామారావు కంఠంలో.

'...వాళ్ళిద్దరికీ కొద్దిగా అభిప్రాయ భేదాలు వచ్చాయి లెండి ఆ మధ్య—అందుకే కొద్దిగా ముభావంగా వుంటారు.'

'అంటే నీవు రాకముందు వీళ్లిద్దరే కదా ఆంధ్రులిక్కడ—అయినా పోట్లాడుకున్నారా? ఒకే రాష్ట్రంలోంచి వచ్చి కూడా ఇక్కడ దెబ్బలాడుకోవడం ఏమిటి ?' ఆశ్చర్యంగా అడిగాడు రామారావు.

'ఏం, ఒకేరాష్ట్రం వారైతే స్నేహంగా వుండాలనీ, మిగతా రాష్ట్రాలవారితో దెబ్బలాడుకోవాలనీ ఎక్కడుంది ? మనుషులైన తరవాత అభిప్రాయభేదాలు రావడం సహజం. ఒకే ఇంట్లో పుట్టి పెరిగిన అన్నదమ్ములు దెబ్బలాడుకోగా లేంది ఇదేమంత విచిత్రంగా వుంది మీకు? మనమందరం భారతీయులమే అనే భావన వుంటే ఇక మనం సాధించలేనిదేముంది ?'

'నివెన్నైనా చెప్పవోయ్—అసలు ఆంధ్రులు తమలో తాము పోట్లాడుకునే ఇలా అఘోరిస్తున్నారు. అక్కడ రాష్ట్రంలో అలా ఏడిస్తే, ఇక్కడ ఇంత దూరంలో కూడా ఇదేమిటి ?'

రవి ఏం మాట్లాడలేదు.

రవి, రామారావు, పార్వతి కలిసి నారాయణ ఇంటికెళ్లారు ఒక రోజు. అక్కడ పి. వి. రావును చూసి పూర్తిగా ఆశ్చర్యపోయాడు రామారావు. నారాయణా, పి. వి. రావూ కలిసి జోకులేసుకోవడం చూసి ఉండబట్టలేక అడిగాడు తిరిగి వస్తున్నప్పుడు.

'అభిప్రాయబేధాలు ఏ ఇద్దరికేనా వస్తాయి; అందుకని స్పర్ధలు పెంచుకుంటామా ? కొద్ది రోజుల్లో మామూలుగా అయిపోతారు మళ్లీ.'

'అది కాదోయ్, ఒక్కసారిగా ఎలా కలిశారంటావు వీళ్ళు ?'—ఏదో తెలిసినట్టుగా మళ్ళీ అడిగాడు రామారావు, '...నీవు సంధి కుదిర్చావేమిటి ?'

రవి చిన్నగా నవ్వాడు జవాబివ్వకుండా.

'ఏం, ఒంట్లో బావుండలేదా ?' రవి అడిగాడు పార్వతిని.

'బాగానే వున్నానే' నీరసంగా వచ్చింది పార్వతి.

'ఒంట్లో బాగాలేదని కాదోయ్—ఇంటి మీద బెంగ.' కొద్దిగా కఠినంగా అన్నాడు రామారావు.

'...లేకపోతే ఏంటండీ—ఇల్లు వదిలి అందరికీ దూరంగా, ఎవరూ లేనట్టు ఎన్ని రోజులని ఇక్కడ వుండటం? అడవిలో వున్నట్టుంది నాకు. ఎంత తొందరగా వీలైతే అంత తొందరగా వెళ్ళిపోవాలనుంది నాకు.' దాదాపు ఏడుపు గొంతుకతో అంది పార్వతి.

'ఈ లెక్కన చూస్తే నాకు ఛస్తే పెళ్లవదు.' అల్లరిగా అన్నాడు రవి.

'ఏం ?' అంతా మరచిపోయినట్టు అడిగింది పార్వతి.

'ఇంతదూరం వచ్చి నాతో ఉండడానికి తెలిసి తెలిసి ఏ అమ్మాయి సిద్ధపడుతూందీ ? నాకు వద్దు వీడు— అనేస్తూంది చక్కగా ... అయినా ఇప్పుడు వెనక్కు ఎలా వెళ్తారు ? అక్కడా అసిస్టెంటు ప్రొఫెసరు ఉద్యోగం ఖాళీగా వున్నట్టు పేపర్లో వేశారా ?'

'లేదు, లేదు. అక్కడి లీవుతీసుకుని వచ్చానుగదా. మళ్ళీ లెక్చరరుగానే వెళ్ళాలి.'

'మీరక్కడ రిజైనుచేసి రాలేదూ !'

'లేదు ఎందుకేనా మంచిదని లీవులో వచ్చాను. ఇక్కడ సరిపడకపోతే వెళ్ళిపోవచ్చని.'

'అదీ సంగతి—అందుకే మీరు మొదటి నుండీ వెళ్లిపోతాం, వెళ్లిపోతాం అంటున్నారు. చక్కగా రిజైన్ చేసివస్తే ఇక్కడే సర్దుకు పోయేవారు.'

రామారావు సాలోచనగా వుండి పోయాడు.

పార్వతి అంది 'అసలు నేను మొదటి నుండీ ఒప్పుకోలేదండీ. ఈయనే అక్కడ సరిపడకపోతే తిరిగి వద్దాం 'అని చెబితే ఏదో సరేనండీ అన్నాను... నాకేమో అన్నదమ్ములెవరూలేరు. చెల్లెళ్లు బాగా చిన్నవాళ్లు. మా అమ్మా నాన్నగార్లు ఒప్పుకోలేదు—అత్తా మామగారయితే సరేసరి.' వణికే కంఠంతో బెంగగా అంది మళ్ళీ, 'అక్కడెవరికేనా ఏదేనా అయితే మాకు కబురందేందుకే ఒక రోజు పడుతూంది మేం వూరు చేరడానికో మూడునాలుగు రోజులు,—ఎలా వుంటాం. చెప్పండి ఈ పరిస్థితుల్లో ఇక్కడ ?'

'ఎవరికేనా — ఏదేనా అవుతూందని ఎందుకనుకుంటారు?' రవి ఎదురు ప్రశ్న

రసవర్గాలు - గుణాలు :

నువ్వుల నూనె

అన్నంలో కలుపుకునేటందుకు సాధారణంగా మన ప్రాంతంలో నువ్వులనూనె వాడుతూంటారు.

నువ్వుల నూనె జఠరదీప్తిని, దేహపుష్టిని, బలాన్ని యిస్తుంది. దురద మొదలగు చర్మరోగాలను, క్రిమిరోగాన్ని, వాతాన్ని గొట్టును.

ఈ నూనెను అధికంగా వాడితే బాగా వేడిచేస్తుంది. పైత్యం చేస్తుంది దగ్గట్టుకుంటుంది. కఫాన్ని, గుండె నొప్పిని శ్వాసను హెచ్చిస్తుంది. రక్తాన్ని క్షీణింపజేస్తుంది. శూలను పుట్టిస్తుంది. మేహజ్వరాలను బలపరుస్తుంది. విరేచన బద్ధం చేస్తుంది. గర్భిణీ స్త్రీలు మరీ అమితంగా పుచ్చుకుంటే గర్భస్రావం కల్గవచ్చు!

నూనెను గాయంపైనగాని, సెగ్గడ్డల పైనగాని, పూసినట్లయిన వానిని మృదువు పరచి కొంతవరకు మాన్పును. వడ తగిలిన మనిషికి నూనెలో చనుబాలు పోసి రంగరించి చెవులలో పోసిన వడతీరుతుంది.

నూనె పిండివంటలు పిదాహం చర్మరోగం, పైత్యం, వేడి, రక్తపైత్యం, వీనిని పుట్టిస్తాయి. సులభంగా జీర్ణం కావు. అధికంగా తింటే కళ్ళకు జబ్బులొస్తాయి.

నేత్రరోగాలు, జ్వరం, కుష్ఠు, శూల, భగందరము, పిచ్చి మతిభ్రమ గలవారు, రసమిశ్రితమైన ఔషధములు సేవిస్తున్నవారు నూనెను లోపలికి పుచ్చుకోకూడదు.

నూనెయొక్క దుర్గుణాలకు విరుగుళ్ళు. **1.** కలినీళ్ళు. 2. నీళ్ళుకలిపిన తేనె. 3. నారింజపండు. 4. పులిమజ్జిగ.

సోపు

భోజనానంతరం కాస్త సోపు నోట్లో వేసుకొని నమిలే అలవాటు కొంతమందికుంటుంది. ఇది పెద్ద జీలకర్ర వలె ఉంటుంది. వేడిచేసి ఆర్పుతుంది.

పొట్టకు, గుండెకు, కళ్ళకు బలాన్నియిస్తుంది. వాతాన్ని హరిస్తుంది. హృదయంలోని వికారాన్ని, నొప్పిని. ప్రక్కటెముకలలోని నొప్పిని, కడుపుబ్బును, అగ్నిమాంద్యాన్ని పోగొడుతుంది. ఊపిరి తిత్తుల్ని కిడ్నీస్‌ను, లివర్‌ను, శుభ్రపరుస్తుంది— శరీరంలోని చెడు పదార్థాల్ని తొలగించేందుకు తోడ్పడుతుంది. మల మూత్రబద్ధమును విప్పుతుంది. బిడ్డల కడుపుబ్బును శమింపజేస్తుంది. బాలింతలగు స్త్రీలకు బాగా పాలు పడేటందుకు దోహదం చేస్తుంది.

హృద్రోగం, గుండె అదురుట, స్మారకం లేకపోవుట యిత్యాది బాధలున్నట్లయితే ఎద్దునాలుక చెట్టుయొక్క పువ్వులతో కషాయం పెట్టించి— ఆ కషాయంలో తగు మోతాదులో సోపు కలిపియిస్తే పై బాధలు తగ్గుతాయి. సోపు, సొంటి, నీళ్ళతోనూరి రసంతీసి, కొంచెం తేనె, పటిక పంచదార వేసి, తగు మోతాదులో పుచ్చుకుంటే గుండె నొప్పి తగ్గుతుంది.

దగ్గుకు, ఉబ్బసమునకు, యిచ్చే ఔషధములకు సోపు అనుపానంగా యిస్తే- ఆయా ఔషధములయొక్క గుణం త్వరగా శరీర మంతటా వ్యాపిస్తుంది.

సోపును తేనెతో కలుపుకొని తింటే సామాన్యమైన జ్వరం తగ్గుతుంది.

ఒక్క డ్రాము ఎత్తు సోపు చూర్ణంలో అంతే ఎత్తుగల పంచదార కలుపుకొని వేసవి కాలంలో ఉదయంపూట పుచ్చుకుంటే ఆ సంవత్సరంలో సామాన్య పరిస్థితులలో ఏ వ్యాధి సోకదు.

సొంటి , సోపును వేరువేరుగా నేయిలో వేయించి— శుభ్రమయిన గుడ్డతో తుడిచి— వేరువేరుగా చూర్ణించి— సమ భాగాలుగా కలిపి — చిటికెడు చూర్ణాన్ని నోటిలో వేసుకొని కొద్దిగా సీలు పుచ్చుకుంటే నీళ్ళ విరేచనాలు కడతాయి.

సోపును పసుపు నీళ్ళతో నూరి రసం తీసి త్రాగిన—తుమ్మెదకాటు బాధ తగ్గుతుంది.

సోపు ఆకురసాన్ని కళ్ళల్లో వేస్తే నేత్రరోగాలు నయమవుతాయి.

సోపు చెట్టువేరును తేనెతో గంధం తీసి యిస్తే పిచ్చికుక్క విషం విరుగుతుంది సోపు ఆరమునకు కూడా సోపుకు గల గుణాలే కలవు.

సోపును నీళ్ళతో నూరి తీసిన రసం యొక్క మోతాదు 1 మొదలు 4 తులముల ఎత్తువరకూ యివ్వనగును. సోపు అరఖు మోతాదు రెండు మూడు చుక్కలు అవున్ను నీళ్ళలోగాని — తమలపాకు మీదగాని, వేసి యివ్వనగును. రసం తయ్యడానికి 1/8 తులం మొదలు 1 తులం ఎత్తువరకూ సోపు వాడవచ్చును.

కాకతర్వంగలవారు సోపు అధికంగా తింటే నష్టం వాటిల్లుతుంది.

దీని యొక్క దుర్గుణాలకు విరుగుళ్ళు: **1.** మంచిగంధం. 2. శికింజబీను.

సేకరణ : ఆకుంది నారాయణమూర్తి

ప్రవాసి

వేశాడు.

'కీడెంచి మేలెంచమన్నారు కదా !' రామారావు అన్నాడు.

'మీరు కీడుమాత్రం ఎంచుతున్నారు. మేలు సంగతి ఆలోచిస్తున్నట్టు లేదే? ఇక్కడినుండి ఇల్లు చాలాదూరం అనుకోండి, కాని దానివల్ల ఏలాభాలూ లేవంటారా ? ఇక్కడి ప్రదేశాలూ అవీ చూడడం మళ్ళీ మళ్ళీ వీలుపడుతుందా మనకు ? మనం ఎక్కడ వుంటే అదే మన ఇల్లు అనుకుంటే సరిపోలా ? ఇంటికి దూరంగా వుండటంవల్ల కొత్త పరిచయాలేర్పడుతాయి, విశాల దృక్పథం, కొత్త విషయాలపట్ల ఆసక్తి ఏర్పడుతాయి—కాదంటారా ? స్వార్థం అనుకున్నా... ఇక్కడి వుద్యోగం వదిలి మళ్ళీ అక్కడ లెక్చరరుగా జాయిన్ అయితే, క్షమించాలి, అసిస్టెంటు ప్రొఫెసర్ అవడానికే ఎన్నేళ్ళు పడుతుందో ఆలోచించారా ? ఆ తరవాత సంగతి దేముడెరుగు. ఇక్కడే ఓ ఐదారేళ్ళు అసిస్టెంటు ప్రొఫెసరుగా పనిచేస్తే ప్రొఫెసరుగా వెళ్ళవచ్చునేమో మీ వూరికి. తొందరపాటులో ఇలా వచ్చిన అవకాశం వదులుకుని వెళ్ళిపోవడం ఏమంత మంచి విషయంకాదని నా ఉద్దేశ్యం.'

రామారావూ, పార్వతి వింటూ ఉండిపోయారు.

'ఇక మమతలూ, అనుబంధాలూ అంటారా—మా తమ్ముడు రఘు ఢిల్లీలో పనిచేస్తున్నాడు, చెల్లాయికి పెళ్ళై వెళ్ళిపోయింది; ఇక పెద్ద ఇంట్లో బిక్కుబిక్కుమంటూ మా అమ్మా నాన్నా మాత్రం వుంటారు. మనం చాలా విషయాల్లో ఎంతో బలహీనులం. మనకు తెలికుండానే మనం ఆత్మవంచన చేసుకుంటాం. మన దేశంలోనే పరదేశీయులమై పోతే విదేశాలకు వెళ్ళినవారి సంగతి? మా బాబాయి అమెరికాలో వున్నప్పుడు రాసేవాడు—నాకు హైదరాబాదులో మన వాళ్ళ మధ్యన వుండడానికి వీలయ్యే పక్షంలోనే తిరిగి వస్తాను, అందరికీ దూరంగా వున్నప్పుడు నాకు మద్రాసైనా, ఢిల్లీ అయినా, అమెరికా అయినా ఒకటే అని

దీనికేమంటారు? విదేశాల్లో అయితే వేలాది మైళ్ళదూరంలో వుండటానికి మనం సిద్ధమే, కాని మన దేశంలోనే మరో ప్రాంతంలో వుండటానికి ఎందుకు జంకుతాం? మీరుకూడా విదేశాల్లో స్కాలర్‌షిప్పు వస్తే ఇప్పుడాలోచించే విషయాలన్నీ ఆలోచిస్తారా! ఈ మనస్తత్వం మంచిది కాదంటాను నేను. పెద్దవారైనా మన స్నేహం మూలంగా చెబుతున్నాను నేను.'

'నీవు చెప్పేది నిజమేనోయ్! కాని ఈవిడ వూరికే పోరుపెడుతుంటే ఎలా భరించడం? ఇక్కడేం తోచడంలేదు అని గోలపెడుతూంటే ఏం చేయగలన్నేను?'

'మీరు పూర్తిగా ఆవిడపైకి తోయడం భావ్యంకాదు. మీకుమాత్రం తీవ్రంగా అనిపించడం లేదూ వెళ్లిపోవాలని? మీరే ఇక్కడ సరిపెట్టుకోలేనప్పుడు ఆవిడ ఎలా వుంటారు? ఒకవేళ మీకు ఇక్కడే వుండాలని వుంటే ఆవిడను ఒప్పించగలగడం ఏమిటీ—మొదట్లోనే రిజైన్‌చేసి వచ్చేవారు.'

పార్వతి ఆతృతగా రామారావు వేపు దృష్టి మరల్చింది.

పేలవంగా నవ్వాడు రామారావు. 'అవునోయ్—నాకు చిన్నప్పటినుండీ తిరగడం, ఇంటికిదూరంగా వుండటం అలవాటులేదు. బలహీనతే అను— మరేదేనా అను. పార్వతి కూడా బెంగగావుంటే పూర్తిగా భరించలేక పోతున్నాను. ఇక్కడికి వచ్చి నాలుగు నెల్లపైనే అయినా సరిపెట్టుకోలేక పోతున్నాను నేను. ఈ డిసెంబర్లో వెళ్లి పోదామనుకుంటున్నాం.'

పార్వతి మొహంలో కొత్త కాంతి, గెలుపొందినట్టుగా ఉత్సాహమూ కనిపించాయి.

'మీరు ఇక్కడే వుండిపోతారా?' పార్వతి అడిగింది.

'చెప్పలేను. నాకు ఎక్కడేనా ఒక్కటే—నేను సరిగ్గా పనిచేయగలిగినంత కాలం ఇక్కడే వుండిపోతానని గట్టిగా చెప్పలేను. అవకాశం వుంటే మరోచోటికి తప్పకుండా వెళ్తాను. మా వూరికి దగ్గర్లోనే వుండాలని నేననుకోవడం లేదు' నిశ్చలంగా అన్నాడు రవి.

నవ్వుతూ అంది పార్వతి 'మరి మీకు పెళ్లి కాదుగా!'

నవ్వుతూనే జవాబిచ్చాడు రవి 'క్షమించాలి. పెళ్లే జీవితానికి పరమార్థం అనుకోను. నాతోడుగా నడవగలిగే అమ్మాయి కనుపిస్తే తప్పకుండా పెళ్లి చేసుకుంటాను. ఆమె ఏ రాష్ట్రానికి చెందినదైనా నా కనవసరం. అలా ఎవరూ కనిపించకపోతే ఇలాగే జీవితయాత్రను సాగించగలను.' కాస్సేపాగి చిలిపిగా అన్నాడు రవి, 'ఆంధ్రుల అమ్మాయిలకెవ్వరికీ నే నక్కర్లేకపోతే రాజస్థాన్ కన్యనే చేసుకుంటాను.'

* * *

బరువుగా నిట్టూర్చి తలెత్తి చూశాడు అసిస్టెంటు ప్రొఫెసర్ రామారావు, అసోసియేట్ లెక్చరర్ ధర్మారావువేపు. కాన్పూర్‌లో లెక్చరరుగా అపాయింట్‌మెంటు వచ్చింది వెళ్లాలా అని, వెళ్లితే ఎలా వుంటుందక్కడ అని రామారావును సలహా అడగడానికి వచ్చాడతను. ఒక్కసారిగా రవి జ్ఞాపకం వచ్చాడు రామారావుకు. నెరిసిన జుత్తులోకి వేళ్ళు పోనిస్తూ అన్నాడు.

'తప్పకుండా వెళ్ళండి, మీరు ముందుకు పోవడానికి మంచి అవకాశాలున్నాయి అక్కడ. వచ్చిన అవకాశం వదులుకోవడం మంచిది కాదు. కాన్పూర్‌లో డాక్టర్ రవి ప్రొఫెసర్‌గా వున్నాడు; నాకు బాగా తెలుసతను చాలా మంచివాడు. మీకు ఉత్తరం రాసిస్తాను, కూడా తీసుకెళ్ళండి.'

నమస్కరించి వెళ్లిపోతున్న ధర్మారావును వెనక్కి పిలిచాడు రామారావు.

'లీవు తీసుకోకండి— రిజైన్‌చేసి వెళ్ళిపొండి' కంగారుగా అన్నాడు. ●